# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 21-04-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ దేశ యువత ఆశలను నెరవేర్చేందుకు అత్యంత వేగంగా పనిచేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పౌర సేవకులను సూచించారు.
- ❖ అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఈరోజు న్యూఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తో సమావేశమయ్యారు
- ❖ జార్ఖండ్‌లోని బొకారో జిల్లాలో ఈరోజు తెల్లవారుజామున జరిగిన ఎన్కౌంటర్ లో 8 మంది మావోయిస్టులు మరణించారు
- ❖ పోప్ ఫ్రాన్సిస్ ఈరోజు ఉదయం 7గంటల 35 నిమిషాలకు మరణించారు
- ❖ నమో భారత్ ర్యాపిడ్ రైలు గురువారం నుంచి సేవలు అందించనుంది

=======================

దేశ యువత ఆశలను నెరవేర్చేందుకు అత్యంత వేగంగా పని చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పౌర సేవకులకు సూచించారు. 17వ పౌర సేవల దినోత్సవం సందర్భంగా న్యూఢిల్లీలో ఈరోజు ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో సివిల్ సర్వెంట్స్ నుద్దేశించి ప్రధానమంత్రి ప్రసంగించారు. గత దశాబ్దంలో దేశం పరివర్తనాత్మక మార్పులను చూసిందని, పాలనా పరంగా నూతన ప్రమాణాలను నిర్దేశిస్తోందని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఆకాంక్షాత్మక జిల్లాల కార్యక్రమం గురించి ప్రధానమంత్రి ఈ సందర్భంగా మాట్లాడుతూ...

(వాయిస్ 36 సెకన్లు)

అనంతరం జిల్లాల సమగ్ర అభివృద్ధి, ఆకాంక్షాత్మక జిల్లాల కార్యక్రమం, ప్రజా పరిపాలన, ఆవిష్కరణల విభాగాలలో అత్యుత్తమ సేవలందించిన పౌర సేవకులకు ప్రధానమంత్రి అవార్డులను ప్రదానం చేశారు. అదే విధంగా ఈ కార్యక్రమంలో రెండు ఈ-బుక్‌లను కూడా విడుదల చేశారు.

=======================

అమెరికా ఉపాధ్యక్షులు జేడీ వాన్స్ ఈరోజు న్యూఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో సమావేశమయ్యారు. నాలుగు రోజుల పర్యటనలో బాగంగా ఈరోజు జేడీ వాన్స్ కుటుంబ సమేతంగా భారతదేశానికి చేరుకున్నారు. ద్వైపాక్షిక చర్చలలో భారతదేశం-అమెరికా వ్యూహాత్మక సహకారాన్ని బలోపేతం చేయడంపై ఇరువురు ఈ సందర్భంగా చర్చించారు. భారత్ అమెరికా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేయడానికి కొనసాగుతున్న ప్రయత్నాల తరుణంలో ఈ సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది.

=======================

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చేపట్టిన స్పాడెక్స్ మిషన్ కింద ఉపగ్రహాల రెండవ దశ డాకింగ్ ప్రక్రియ ఈరోజు విజయవంతంగా పూర్తయింది. రాబోయే రెండు వారాల్లో మరిన్ని ప్రయోగాలు చేపడుతున్నామని శాస్త్ర సాంకేతిక శాఖా మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ సామాజిక మాధ్యమంలో పేర్కొన్నారు. ఈ సంవత్సరం జనవరి 16న ఉపగ్రహాలు మొదటిసారిగా అనుసంధానం చేయబడ్డాయని గత నెల 13న వాటిని విజయవంతంగా అన్‌డాక్ చేశామని ఆయన పేర్కొన్నారు.

=======================

జార్ఖండ్‌లోని బొకారో జిల్లాలో లుగు కొండ దిగువ ప్రాంతంలో ఈరోజు తెల్లవారుజామున జరిగిన ఎదురు కాల్పుల్లో 8 మంది మావోయిస్టులు మరణించారు. 2026 మార్చ్ నాటికి భారతదేశంలో నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించాలని నిర్దేశించుకున్న లక్ష్యంలో భాగంగా దేశంలోని పలు ప్రాంతాల్లో కూంబింగ్ పేరిట పెద్ద ఎత్తున ఆపరేషన్లు చేపడుతున్నారు. అందులో భాగంగా ఈరోజు జార్ఖండ్‌లో ఆ రాష్ట్ర పోలీసులతో కలిసి సీఆర్పీఎఫ్ బలగాలు కూంబింగ్ నిర్వహించగా.. మావోయిస్టులు తారసపడటంతో ఎదురుకాల్పులు జరిగాయి. చనిపోయిన మావోయిస్టుల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నామని, దాదాపు 2 గంటల పాటు ఈ ఆపరేషన్ కొనసాగిందని జార్ఖండ్ డీజీపీ అనురాగ్ గుప్తా తెలిపారు.

=======================

పోప్ ఫ్రాన్సిస్ ఈరోజు ఉదయం 7 గంటల 35 నిమిషాలకు మరణించారని వాటికన్ అధికార వర్గాలు ధ్రువీకరించాయి. ఆయన గత కొంతకాలంగా శ్వాసకోశ సమస్యలతో బాధపడుతూ ఫిబ్రవరి 14 నుంచి 38 రోజుల పాటు ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం గత నెల డిశ్చార్జి అయ్యారు. 2013లో పోప్ బెనిడెక్ట్ తర్వాత కేథలిక్‌ల అత్యున్నత మత గురువుగా పోప్ ఫ్రాన్సిస్ బాధ్యతలు చేపట్టారు. పోప్ ఫ్రాన్సిస్ తన మరణానికి కొన్ని గంటల ముందు కూడా ఈస్టర్ పర్వదినాన భక్తులకు సందేశం ఇచ్చారు. ఆయన మృతిపై ప్రపంచ నాయకులు సంతాపం ప్రకటించారు. పోప్ ఫ్రాన్సిస్ మరణం చాలా బాధాకరమని, ఎంతోమంది ఆధ్యాత్మిక ధైర్యానికి ఆయన ఒక ప్రతీకగా గుర్తుండిపోతారని ప్రధానమంత్రి నరేంద్రమోడీ సామాజిక మాధ్యమంలో పేర్కొన్నారు.

విరామం

=======================

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సౌదీ అరేబియా పర్యటన నిమిత్తం రేపు జెడ్డా నగరానికి వెళ్లనున్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా ఇంధనశక్తి, రక్షణ రంగం, వాణిజ్యం వంటి కీలకమైన రంగాలలో ఇరుదేశాల మధ్య సహకారాన్ని విస్తరించడమే లక్ష్యంగా క్రౌన్ ప్రిన్స్ మొహమ్మద్ బిన్ సల్మాన్‌తో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చర్చలు జరపనున్నారు. అలాగే ఈ పర్యటన సందర్భంగా ప్రధానమంత్రి ఒక కర్మాగారాన్ని సందర్శించి, అక్కడ ఉన్న భారతీయ కార్మికులతో సంభాషించనున్నారు.

=======================

దేశంలోని మారుమూల ప్రాంతాలను సైతం అనుసందానించేందుకు భారతీయ రైల్వే నిరంతరం కృషి చేస్తోంది. అందులో భాగంగా 16 బోగీలతో కూడిన తొలి నమో భారత్ ర్యాపిడ్ రైలుని ప్రవేశపెట్టనుంది. బిహార్‌లోని జయ్‌నగర్ - పట్నా స్టేషన్ల మధ్య ఈ ర్యాపిడ్ రైలు సేవలందించనుందని కేంద్ర రైల్వే మంత్రిత్వశాఖ వెల్లడించింది. అదే విధంగా అమృత్ భారత్ 2.0 పేరిట భారతీయ రైల్వే బీహార్‌లోని సహర్సా జంక్షన్ నుండి మహారాష్ట్రలోని లోకమాన్య తిలక్ టెర్మినల్ వరకు ప్రవేశపెట్టనుంది. అధునాతన సౌకర్యాలతో తీర్చిదిద్దిన ఈ రైళ్లను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గురువారం ప్రారంభించనున్నారని రైల్వే బోర్డు అధికారి దిలీప్ కుమార్ వెల్లడించారు. 16 కోచ్‌లతో నడిచే ఈ నమో భారత్ రాపిడ్ రైలు గరిష్ఠంగా 110 కిలో మీటర్ల వేగంతో ప్రయాణిస్తుందని ఆయన వివరిస్తూ...

(వాయిస్ 40 సెకన్లు)

======================

కాలేయ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవడానికి, క్రమం తప్పకుండా తనిఖీలు చేయించుకోవాలని జె పీ నడ్డా సూచించారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని అవలంబించాలని  ప్రజలకు ఈరోజు ఆయన పిలుపునిచ్చారు. న్యూఢిల్లీలో ఆరోగ్య మంత్రిత్వ శాఖ నిర్వహించిన ఆరోగ్య శిబిరంలో "కాలేయ ఆరోగ్య ప్రతిజ్ఞ వేడుక"లో మంత్రి ప్రసంగిస్తూ ఆరోగ్యంగా లేకపోతే, మొత్తం శరీరంపై దాని ప్రభావం పడుతుందని జె పీ నడ్డా పేర్కొన్నారు. కాలేయ ఆరోగ్యం సరిగా లేకపోవడం గుండె జబ్బులు, మధుమేహం, రక్తపోటు లేదా క్యాన్సర్‌కు కూడా దారితీస్తుందని ఆయన అన్నారు.

======================

రాబోయే 5 రోజులు మధ్య భారతదేశంలో వడగాలులు వీచే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (IMD) తెలిపింది. ఈ నెల 25 వరకు రాజస్థాన్, మధ్యప్రదేశ్, విదర్భ, ఛత్తీస్‌గఢ్‌లలో వడగాలులు కొనసాగుతాయని వెల్లడించింది. మరోవైపు ఈ నెల 26 వరకు ఈశాన్య భారతదేశంలో భారీ నుండి అతి భారీ వర్షాలు కురుస్తాయని తెలియజేసింది.రాబోయే 3 రోజులు మధ్య భారతదేశంలో గరిష్ట ఉష్ణోగ్రతలు 2 డిగ్రీల సెల్సియస్ తూర్పు భారతదేశంలో 4 నుండి 6 డిగ్రీల సెల్సియస్ పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాస్త్రవేత్త  వెల్లడిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

======================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు లాభాలతో ముగిసాయి. సెన్సెక్స్ 78 వేల 553 పాయింట్లతో లాభాల్లో ప్రారంభమై.. చివరకు 855 పాయింట్ల లాభంతో 79 వేల 408 వద్ద స్థిరపడింది.

======================
======================